



సుబ్రహ్మణ్యం తలెత్తి తన ముఖం చూసేడు మళ్లీ "మీకేం ఏదో ఒకటి చెయ్యాలి అన్నట్టు

ఏం చేస్తాడు తను? చెయ్యగలిగిన దంతా యిదివరకే చేసేడు ఇంతకీ వాడికి బాగుపడే అదృష్టం లేనప్పుడు తన మాటలు ఎందుకు రుచిస్తాయి? ఇప్పుడే కాదు గత ఆర్నెల్లనుంచీ తన మాటలు చేదయిపోయేయి వాడికి తను కన్పిస్తే ఎక్కడ మాట్లాడవలసి వస్తుందో అన్నట్టు ముఖాన్ని ప్రక్కకి కూడా తిప్పుకుని తిన్నగా కారుని డ్రైవు చేసుకు వెళ్లిపోతూన్నాడు సత్యం ఈ తెలివితేటలు యితర విషయాల్లో కూడా వుంటే ఎంత బావుణు

గోళ్లు కొరుక్కుంటూన్న సుబ్రహ్మణ్యం వక్క క్షణం ఆగి అన్నాడు "అసలు నే నొచ్చిన దగ్గర్నుంచీ చూస్తున్నాగా బాబాయి అన్నయ్యని తువరం చేసేస్తున్నాడు ఆ స్నేహితులంతా అసలు నా అనుమానం అన్నయ్యకి పిచ్చెక్కుతోందేమో నని కూడాను

టిన్నులోంచి సిగరెట్ ఒకటి తీసుకుని తిరిగి సోఫాలో కూలబడ్డాడు తను ఇది మొదటిసారి కాదు సుబ్రహ్మణ్యం తనవద్దకి రావడం గత నాలుగెల్లల్లోనూ ఆరుసార్లొచ్చేడు ఆరుసార్లు ఆరురకాల విషయాలు చెప్పేడు అన్నీ సత్యం ప్రవర్తనని గురించిన ఫిర్యాదులే

'చూడు బాబాయి ఇట్లా చేస్తే మన పరువు ప్రతిష్టలు ఏముంటాయి చెప్పు స్టుడియోదగిర ఎక్స్ట్రాలతోటి, క్లాస్ బాయిస్ తోటి ఆప్తబంధువులా అన్నాయికి—ఏమిటా కబుర్లు? ప్రొడ్యూసర్లు వాళ్లూ ఏమనుకుంటారో అనయినా వుండ దాతనికి కొత్తవాళ్లొచ్చినప్పుడు మంచీ చెడ్డా మాట్లాడటం, ఫలోక్తులాడటం యిదేమీ లేదు ఏదో విరోధుల్ని చూసినట్టు చిరాకు పడతాడు వాళ్ళని చూడగనే అన్నాయి గొప్ప రచయిత కనక సరిపోయిందిగాని లేకపోతే యీపాటికి అవతలకి పొమ్మనేవారు కాదూ నువ్వైనా చెప్పుచూడు బాబాయి" అన్నాడు సుబ్రహ్మణ్యం మళ్లా

అవును ప్రఖ్యాత రచయిత కనకనే సరిపోయింది వాడిని యింత పైకి తేవడానికి అవస్థలు పడింది తను కనక యివన్నీ వినడానికి బాధగా వుంటుంది అసలు వాడికి చీకూ చింతా లేదు హాయిగా వున్నాడు

అసలీ దేశంలో కలం పుచ్చుకొని ఎందరు బాగుపడ్డారో తెలిస్తే వాడిలా ప్రవర్తించి వుండడు

ఈ పత్రికల్ని చదివేఅలవాటు ఎన్నడూ లేని తను, వాడికోసమే అన్నట్టు ఓ పత్రిక కని ఓవాడు తెరవటం శురుకొన్నాండి తన కిప్పుడు సత్యం పేరుతో ఓ గేయం కళ్లపడింది చాలా చురుకుగాను, రసవంతంగానూ వుందది దానిలో బరువూ, తీవ్రతా, వేగమూ ఎంతో సజీవంగా కన్పించేయి ఎన్నడూ యీ 'సత్యం' ది అనుకోలే తను తర్వాత ఆ పత్రికా సంపాదకుడు మాటల సందర్భంలో ఎవరో 'ఆఫీసు గుమాస్తా'ది అన్నాడు అతర్వాత తను సత్యం గేయాలకోసం ఆ పత్రికని ప్రతీ వారం వెదకసాగేడు కథలు కూడా సత్యం కలంనుంచి వెలువడటం చూసేడు తను చాలా సునిశితమైన విమర్శతో కూడిన కథలవి ప్రజల అజ్ఞానం గురించి ఆవేదనా పీడితప్రజల నికృష్టజీవితం, స్వాతంత్ర్యకాంక్ష, తోడి మానవులపైన విపరీతమైన సానుభూతి యిదీ అతని కథాసా

మ్రగి కొలది నెలల్లోనే సత్యం ఖ్యాతి ప్రజల్లో పాకిపోవడం చూచేడు తను

ప్రొడ్యూసర్ సుబ్బన్న చౌదరితో మాటల సందర్భంలో 'సత్యాన్ని' గురించి అన్నాడు తనో నాడు "వాడిచేత ఏదైనా రాయించి సినిమాకి వుపయోగించుకో రాదూ" అని కూడా అన్నాడు తను తన మాటమీద విలువున్న సుబ్బన్న చౌదరి 'సరే' అన్నాడు కాని సత్యం ఏ విధాన అంగీకరిస్తేనా? తనెన్నో రకాల చెప్పాల్సొచ్చింది వాడికో నాడు

"ఛ! ఛ! సినిమావాళ్లకి నేనేం రాయగలను" అని ప్రారంభించేడు సత్యం

"సినిమా కథంత తేలికవిషయం మరోటి లేదీ ప్రపంచంలో. ఏదో వకటి రాసెయ్యి"

"నేనట్లా రాయలేను"

"రాయలేకపోడమేంటి? ప్రయత్నం చెయ్యి ఏదో వకటి రాయి నీ పేరుంటే చాలు వాళ్లు కళ్ల కద్దుకుని తీసుకుంటారు"

"నేను రాయను" అంటాడు

"ఏం?"

"నా రచన లెవరికెక్కవాలిరా . నీకు పిచ్చిగాని" అంటాడు

"నీ రచన తీసుకునేట్లు చేసే భారం నాది నువ్వు రాయి ముందు నువ్వు వొట్టి చెత్త రాయి మరేం భయం లేదు వాళ్లకి కావాల్సింది చెత్తే"

వాడకేం అర్థం అయినట్లు లేదు వెర్రి నవ్వు వకటి నవ్వి, 'సరే, ప్రయత్నిస్తా బావుండకపోతే నన్ను తిట్టద్దుసుమా' అన్నాడు

ఇన్నాళ్లు యీ ప్రపంచంలో వీ డెట్లా బతికేడో తనకి అర్థం కాదు

మాంచి కథొకటి రాసేడు తను పోరగా పోరగా ఆ కథని తీసుకుని వాణ్ని పట్టుకుని సుబ్బన్నగారికి అప్పజెప్పి వచ్చేడు తను సుబ్బన్న, డైరెక్టర్ గారితో బాటు సత్యాన్ని కూర్చోబెట్టి తన యిష్టం వచ్చినట్లు కథని మార్పించుకొని చక్కగా సినిమా తీసి పారేశేడు సత్యానికి నాలుగొందలు ముట్టచెప్పేరు కూడాను ముందుగానే

ఆ చిత్రం బోలెడు డబ్బు చేసుకుంటూండగానే సత్యాన్ని మరోడు తన్నుకుపోకుండా సుబ్బన్నగారొచ్చి మరో కథ కావాలండీ అన్నారు తనతో ఈసారి డైలాగ్సు కూడా 'సత్యం' వే అని అన్నారాయన, అప్పుడే తనకు కూడా ఆ కంపెనీలో భాగం తీసుకున్నాడు ఎందుకైనా మంచిదని

సత్యాన్ని కల్సుకొన్నాడు తను "ఇంకో కథ కావాలిట ఓ పదిరోజుల్లో రాసివ్వరా ఈసారి "స్క్రీన్‌ప్లే" కూడా నీదే"

"నా కథని మార్చేసి తగలేసేరు మళ్ళీ యీ జన్మలో రాయను మీ పాడు సినిమా వాళ్ళకి" అన్నాడు వాడు

తనకి నవ్వొచ్చింది ఏ పత్రికలో చూసినా ఆ చిత్రాన్ని, కథని పొగిడేస్తూంటే వీడిల్లా నసుగుతాడేమిటి? ఇప్పటికి ఆ చిత్రంమీద మూడు లక్షలు లాభం వొచ్చింది ఏం బాగుండకే కాబోల్ను!

"ఉన్నదున్నట్టుగానే నీ కథలూ గేయాలూ అచ్చేసేరు నాలుగేళ్ల కాలం.. ఏం వొచ్చింది?" అన్నాడు తను

"మొదట్లో కనక కొత్త అక్కడక్కడ మార్చేరు ఈసారి ఎట్లా రాస్తే బావుంటుందో నీకే తెల్సిపోతుంది వాళ్లేం మార్చరుగా యిక" చెప్పేడు తను.

"నీ యిష్టం వచ్చినట్లు రాయి తీసే బాధ్యత వాళ్ళది కనీసం నాలుగు వేలన్నా ముడతాయి నీ దరిద్రం తీరుతుంది" బోధించేడు తను

"ఆలోచించుకో మరి" వదిలేసేడు తను విసుగెత్తి

తనకి కనబడటమే మానేసేడు వాడు తర్వాత వాళ్ళమ్మ ఏడ్చింది యిదేమిట్రా అని ఆఫీసు స్నేహితులంతా తిట్టేరుట! ఎట్లాగైతేనేం రాసేడు రెండో చిత్రానికి కూడా చిత్రం రిలీజు కాగానే అయిదు కొంట్రాక్టు లొచ్చి పడ్డాయి

మళ్లీ మొదలు రభస!

అక్క డెక్కడో హాస్యం పెట్టి తన కథ బిగువును చెడగొట్టేడట

ఇంకోచో టెక్కడో దేని చేతో నాట్యం కాని నాట్యం చేయించి *sex instonet* రెచ్చకొట్టేరుట అమాయక ప్రజల్లో!

మరోచోట హీరో చేత మర్మంగా తను రాయని (బూతు) మాటల్ని అన్పించేరుట

ఇంకోసారెప్పుడో డైరెక్టరు గారు హీరో పాత్రని యిష్టంవచ్చినట్లు మళ్లీ బల* వంతంగా తనచేత మార్పించేరుట!

తన తాతలు దిగివచ్చేరు సత్యం చేత ఆ కొంట్రాక్టులు వప్పించేసరికి అడ్వాన్సుగానే తను పదివేలు చేతులో వేయించేడు చిత్రాలు అయ్యేక మరో పదివేలు!

సినిమా ఫీల్డులో పడితే వాడు రాణిస్తాడని తనెన్నడో గ్రహించేడు వాడి బుద్ధి మళ్లీ అటు యిటు పోకుండా వుండేందుకని తను వాణ్ని ఆఫీసు వుద్యోగంలోంచి మాన్పించేసేడు కూడాను చక్కటి బంగళాలోకి వాళ్లమకాం మార్పించేడు! 'ఒద్దు మొర్రో' అంటూనాన్నా మళ్లీ నాలుగు చిత్రాలకి కథల డిమాండు తగలగానే ఆ డబ్బెట్టి చక్కటి 'ఓల్డ్సు మొబైలు' కొన్పించేడు సత్యంచేత ఎట్లాగైతేనేం వాడిని కారులో ఎక్కించేడు తను తర్వాత మాత్రం ఓ అరలక్షన్నా వాడిచేత బ్యాంక్‌లో వేయించేడు తను తనేంచేస్తే మాత్రమేమిటి వాడు ఆ హోదాని నిలబెట్టుకోలేనప్పుడు?

సుబ్రమణ్యం లేచి నిలబడి "మరేం చేసేది లేదంటారా? ఏదో ఆలోచించి మీరే చెయ్యాలి ఇట్లాగైతే ఆ వున్నది కాస్తా యిట్టే హరించుకుపోతుంది రోజూ ఓ అరడజను మంది స్నేహితులు సుష్టుగా అక్కడ భోజనాలు సాగిస్తే ఎన్నాళ్లు సాగుతుంది? ఆ వొచ్చే స్నేహితులైనా వొట్టి పనికిమాలిన రకం ఏ డైరక్టర్లో, ప్రొడ్యూసర్లో అయినా ప్రయోజనం వుండనుకోవచ్చు"

"సరే, ప్రయత్నిస్తా నువ్వు వెళ్లిరా"

సుబ్రమణ్యం వెళ్లిపోయిన అరగంట వరకు తను సత్యం సంగతే ఆలోచిస్తూ కూర్చున్నాడు

ఒక్క సుబ్రమణ్యమే కాదు, చాలామంది వింతవింతగా చెబుతున్నారు వాణ్ణి గురించి మధ్య ఎవరెవర్నో తీసుకొచ్చి భోజనాలు పెట్టడమే కాదు అవస్థలో వున్నానన్న వాడి కల్లా యాభయి, వంద, బదుళ్లని యిచ్చి మరచిపోవడం, తెనుగుముఖం కన్పిస్తే వాణ్ని కౌగిలించుకునేంత పని చేయడమే కాకుండా, వాడి కుద్యోగాలు యిప్పించే

(41-వ పేజీ చూడండి)


## రు 100 బహుమానం

(గవర్నమెంటు రిజిష్టర్డు)

తెల్ల వెంట్రుకలను అంత మొందించండి రంగులు వాడకండి మా ఆయుర్వేద సువాసన "సెంట్రల్ మోహిని ఆయిల్" 60 ఏళ్లు దాకా నల్లగా ఉంచును ఇది మీ దృష్టినివృద్ధి పరచి తల నొప్పిని కుదుర్చుతుంది కొన్ని వెంట్రుకలు తెల్లబడితే రూ 2-8-0తో ఒక సీసా (మూడు ఒకసారి 6-8-0) కొనండి హెచ్చుగ తెల్లబడితె 3-8-0 (మూడు ఒకసారి 9-0-0) తలంతా తెల్లబడితే రు 5 0 0 (మూడు ఒకసారి రు 12) కొనండి ఇది అబద్ధమని ఋజువుచేసిన వారికి రు 100 బహుమానం పూర్ణ విశ్వాసానికి అణాన్నర స్టాంపు పంపి గ్యారంటీ తీసుకొనండి

**Bharat Kalyan Aushadhalaya**

Post Bag No 6725, Calcutta (A P)

ప్రయత్నం చెయ్యడం, అడిగినవాడికల్లా కారునిచ్చి తను బస్సెక్కి స్టుడియోకి పోవటం యివన్నీ వాగు చేసే పనుల్లో కొన్ని మాత్రమే ఇంతే కాదు కథ, మాటలు రాసి ప్రొడ్యూసర్ చేతిలో పారేసి 'మీ యిష్టం వచ్చినట్లు ఏడ్వండి, నన్ను మాత్రం యిక పిలవకండి' అనడం, ఊళ్ళోను, పత్రికల్లోనూ అంతా తను కథ రాసిన చిత్రాన్ని పొగడుతూంటే, "అదా! అది వోర్రి చెత్త మూర్ఖులు మెచ్చుకోవలసిందే" అనడం, "సినిమాలవాళ్ళకి బుర్రలు లే"వనడం, "ప్రజ లొట్టి అమాయకులు సుమా!" అని కూడా అంటున్నాడుట ఎంత ఆలోచించినా యీ సత్యం సంగతి అర్థం కాదు తనకి ఏమైపోతున్నాడు సత్యం!

* * *

చూడసాగేడు తను, వా డెక్కడైనా అగుపిస్తాడేమోనని ఈసారి ఏమైనాసరే వాడ్ని కూర్చోబెట్టి నాల్గు విషయాలు క్షుణ్ణంగా మాట్లాడ నిశ్చయించుకున్నాడు తను ఒకటి రెండుసార్లు తన కారుని దూరంనుంచి చూడగానే, ఠెంగున ప్రక్కకి దూకి ఏ బస్సులోకో 'ట్రాం'లోకో జారిపోయేవాడు ఒకసారి పిలుస్తూన్నా, కారులో స్నేహితుల్తో (చిరిగిపోయిన చొక్కాలూ వాళ్లూ-వాళ్లూ స్నేహితులు) కూర్చుని తిన్నగా వెళ్ళిపోయేమ ఆపకుండా

ఆఖరికి దొరికేడు సత్యం ఆ వేళ ట్రిప్లికేన్‌లో ఎవరో స్నేహితులని వొదిలి కారెక్కబోతూన్నాడు తిరిగి తన కారుని యింటికి తీసుకుపొమ్మని తన డ్రైవర్‌తో చెప్పి తను సత్యం కారెక్కేడు సత్యం ఏదోవూహించుకుంటున్నట్లే సుభావంగా కూర్చున్నాడు కారుమ్రింగేస్తూన్న రోడ్డువైపే చూస్తూ

కారులోంచి వెనక్కి చూచేడు తను కారులోంచి దిగినవాళ్ళు ముగ్గురూ ప్రెసిడెన్సీ బుక్ షాప్‌లోకి అదృశ్యమవుతున్నారు మకిలి మొహాల్తో కవులు కాబోల్ను లాల్చీలు వాళ్ళు

ఖాళీగావుంది తన సిగరెట్ 'టిన్' సత్యంవైపు చూచేరు తను, తన ఖాళీ డబ్బాను వాడికి చూపుతూ సత్యం స్టీరింగ్ వైపు తిన్నగా చూస్తూనే, చెప్పేడు "'నా టిన్' వాళ్ళకిచ్చేసేను ఆపైన ఎక్కడైనా కొందాం"

అనవసరం అని తెలిసికూడా అడిగేడు తను "ఎవరు వాళ్లు"

"రచయితలు"

"చాలా బాగా రాస్తారేం?"

"ఆ నాకంటె చాలానయం స్వతంత్ర భావాలు వెలిబుచ్చగల్గుతున్నారు"

"చూడు సత్యం నీకు పరువు ప్రతిష్ఠ లున్నాయి దౌర్భాగ్యులందరితోటి తిరుగుతూంటే నలుగురు ఏమనుకుంటారు?"

వాడు నవ్వేడు "అనుకోనీ" అన్నాడు

"అనుకుంటారులే, అనుకోక మానతారేమిటి? ఇంచుమించు, డైరెక్టర్ సుదర్శనం, ప్రొడ్యూసర్ వెంకన్న మొదలైన వాళ్ల సమానస్థాయిలోవున్న నువ్వు యిట్లా తిరుగుతే, మిగతావాళ్ళ హోదాకి కూడా భంగమే చూడు వాళ్ళు నీతో కలియడానికి భయపడతారు నువ్వంటే యీనాడు అందరికీ భక్తిగౌరవా లున్నాయికదా అవైనా కాపాడుకోవద్దూ"

"అవసరం లేదనుకుంటా" అన్నాడు వాడు

"నీ వెనక తల్లీ, తమ్ముడూ వున్నారు చూడు వాళ్ళని పోషించాల్సిన బాధ్యత నీ మీద ఎంతైనా వున్నప్పుడు నువ్విట్లా అందర్నీ కాదనడం"

"ఇదివరకు కంటె ఎక్కువ హాయిగా వుంటాను అంతేనా?" అడిగేడు

"నీ పేరు ప్రతిష్ఠల మాటో?" కొంచెం చిరాగ్గా అడిగేడు తను

సత్యంముఖం క్రోధంతో జేవురించింది ఒక్కక్షణం స్టీరింగ్ మీది చేతివ్రేళ్లు వణికేయి గట్టిగా అరిచేడతను "పేరు ప్రతిష్ఠలా? ఈనాటి సత్యం పేరెవరిది? మీ అందరిదీ కాదూ? ఈ కథలు, ఈ భావాలు నావేనా? మీరంతా డబ్బుకోసం, ప్రజల్ని వెర్రివాజమ్మల్ని చెయ్యడానికి, వాళ్ల డబ్బు గుంజడానికి నా పేరుతో ఎక్కించినవి కావూ? మీ యిష్టం వచ్చినట్లు రాసుకున్నవి కావూ నా పేరుతో ఇన్ని చిత్రాల్లో నేను రాసిన వక్క స్వతంత్రభావం వుండనిచ్చేరూ మీరంతా కలిసి?"

'సత్యం -' ఆప ప్రయత్నించేడు తను

సత్యం ఆగలేదు కాని కారుమాత్రం ఆగింది సత్యం తన మెడమీద కొచ్చి తన సిల్కులాల్చీని పట్టుకుని గుంజుతూ అరిచేడు "ఈ పతనానికి నువ్వు కదూ కారణం? నెలకి వందరూపాయలు తెచ్చుకుంటూ నా అవస్థ నేను పడేవాడిని ఆ రోజుల్లో వక్కళ్ళకి హానిచేసి ఎరగను నా చుట్టూ తిరిగి, నా ప్రాణాన్ని పిండి, నా శక్తిని గుంజి, నా చేత యీ చెత్తంతా రాయించేరు ప్రజల పుర్రెల్లోకి వెర్రివెర్రి భావాలు ఆశలు వూర తొక్కించేరు వీళ్లంతా ప్రజలా? ఆ కథల్లోని హీరోల్లా, హీరోయిన్లలా యీ యథార్థ ప్రపంచంలో కూడా ప్రవర్తించాలని యాతనపడే వీళ్ళు ప్రజలా? ఏమైపోతున్నారు వీళ్లంతా? ఎందుకిచ్చేరు నాకింత డబ్బుని వాళ్లని మోసంచేసి నా అభాగ్యమిత్రుల్తో కూడా మాట్లాడనీయని యీ గౌరవ ప్రతిష్ఠలు వక జీవితమా? దరిద్రులకుకూడా పనికిరానీయని యీ ధనం ఒక భాగ్యమా? వాళ్లని కార్లో ఎక్కించేననే కదూ మీబాధ? వాళ్ళకి అడక్కుండానే డబ్బు, సిగరట్లు యిస్తున్నాననేకదూ మీబాధ? ఇతర్లలాగ మీ మత్తెక్కిన ధనికుల అడుగులకి మడుగులు ఎత్తడంలేదనే కదూ మీ ఆవేదన? ఛీ! ఈ కారులో నాతోపాటు కూర్చోడానికి కూడా అర్హుడివి కాదు నువ్వు ఒట్టి పురుగువి దిగు ముందు"

వాడి కళ్లు జ్యోతుల్లా వున్నాయి ముఖంలోని నరాలు పైకుబుకుతున్నాయి పళ్లు పటపట కొరుకుతున్నాడు కూడాను వాడు తన నొక్క తోపు తోసి

దిగేడు తను కార్లోంచి తెలుసుకున్నాడు తను వీ డిదివరకు సత్యం కాదని వాడు కారెక్కని సత్యం, కాని వీడా? వీడు పిచ్చెక్కిన సత్యం! భయంతో రోడ్డుకి అడ్డంగా పరుగెత్తేడు తను ★

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావుగారి ఉత్కృష్టరచన

**ఆంధ్రవాఙ్మయ చరిత్ర**

**వెల రు 2-0-0 లు,**

తపాలాఖర్చు ప్రత్యేకము

**నపుంసకతైలం**

అంగ, నరములు బలహీనత ంది చిన్నదైన, తిర్గి యథాప్రకారమై పూర్తి సౌఖ్య మనుభవించుటకు 45 యేండ్ల ప్రఖ్యాతి చెందినది

1 సీసా రూ 10/ వి పి రూ 1-0-0

డా॥ రత్నం సన్స్ మెడికల్ హాల్

మలకపేట బిల్డింగ్స్,

హైద్రాబాద్, దక్కన్